




## *అమెరికాకమ్మ కథలు -1*

### *అనగనగా అమెరికాకి....*

"**మా బంగారు** మీ ఊళ్ళోనే చదువుకోడానికి హ్యూస్టన్ వస్తున్నాడూ, వాడికి విమానాశ్రయంలో ఆహ్వానం చెప్పి, రాగానే గోంగూర పచ్చడితో భోజనం పెట్టి, విశ్వవిద్యాలయంలో నమోదు చేసి మా బెంగ తగ్గించూ, కావాలంటే వాడు గోబీ మంచూరియన్ కూడా తింటాడూ, ఐ యాం ఆల్ రెడీ మిస్సింగ్ హిం," అని ఒక ఒకావిడ గత నాలుగు నెలలుగా నాకు టెలిఫోన్‌లో పురాణ కాలక్షేపం చేస్తోంది. ఈ రోజుల్లో టివీలో చూస్తూ వినాయక వ్రతం చేసుకోవచ్చు కదా...అటువంటిదే అనమాట.

"ఒరేయ్, మా అబ్బాయిని నువ్వు ఎయిర్ పోర్ట్‌లో రిసీవ్ చేసుకుని, యూనివర్శిటీలో సరిగ్గా చేర్పించి, అక్కడే వాడు డిసైడ్ చేసుకున్న అపార్ట్‌మెంట్లో వాడి సామానులు దింపి, కావల్సిన చెంబూ, తప్పేలా, మరియు బాత్ రూం సామాన్లూ కొనిపెట్టి జాగ్రత్తగా చూసుకో, ఒక వారం తరవాత వాడు ఎలాగూ అమెరికన్ అయిపోతాడు కదా. ఈ మాత్రం హెల్ప్ చెయ్యకపోతే నువ్వు హ్యూస్టన్‌లో ఉంటే నాకేంటీ, హిమాయత్ నగర్‌లో ఉంటే నాకేంటీ? అన్నట్టు, వాడికి సరిపడా గోంగూర పచ్చడి, మరియు కందిపొడి ఫారిన్ పేకింగు చేయించి వాడి హేండ్‌బేగ్ పైన ఉన్న చిన్న సంచీలోనే పెడతాను....నిన్ను శ్రమ పెట్టడం నాకు బొత్తిగా ఇష్టం లేదు అని నీకు తెలుసు కదా!" అనేదే ఆ ఆత్మీయురాలి "చిరు" కోరిక. అన్నట్టు, ఆవిడ మాజీ మెగా స్టార్, మరియూ తాజా "ప్రజారాజ్యం" చిరంజీవికి కూడా ఆత్మీయురాలే....ట.

సరే, మనకి ఇటువంటి షిప్పింగ్ అండ్ రిసీవింగ్ పనులు మామూలే కదా! నా లెక్క ప్రకారం గత మూడు దశాబ్దాలగా ఇటువంటి కేసులు ఏడాదికి అరడజను ఉన్నాయి కానీ ఎక్కడో లోపల దాచేసుకోకుండా తన గోంగూర పచ్చడి తనే సెపరేట్‌గా తెచ్చుకున్నాను సుమా అని చెప్పిన కేసు ఇదే అందుచేత ఎందుకైనా మంచిదని మా క్వీన్ విక్టోరియా నా చేత పెట్టించిన అన్ని పచ్చళ్ళూ మా గరాజ్‌లో ఉన్న రెండవ రిఫ్రిజిరేటర్‌లో దాచేసి నేను హుషారుగా హ్యూస్టన్ విమానాశ్రయానికి కరెక్టు టైముకి వెళ్ళాను. వెళ్ళి ఆ కష్టమ్సు వెధవ గోంగూర మరియు కందిపొడిని గుర్తుపట్టి, ఆ పరిమళానికి వాడి ప్రాణాలు గుటుక్కుమనేలోగా తకీమని అక్కడే ఉన్న గార్బేజీలో పారవేయునా, లేక ఈ కాబోయే అమెరికన్ సిటిజన్‌ని సగోంగూర, సకందిపొడితో బైటకు సగౌరవంగా బైటకు పంపించునా అని మూడు గంటలు కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ నేను నెర్వస్‌గా ఉండగా ఆ యువకుడు అమెరికాలో "జింబో నగర ప్రవేశం" చేశాడు. రెండు సూట్ కేసులూ, ఒక హేండ్ బేగులతో "ఈ మాత్రం విమాన ప్రయాణాలు మాకు అలవాటేనోయ్" అనే ఏదో

రాజమండ్రి విమానాశ్రయంలో దిగుతున్న ఫీలింగుతో ఉన్న ఆ యువకుణ్ణి చూడగానే నేను ముప్ఫై నాలుగు సంవత్సరాల నలభై రెండు రోజుల మూడు గంటల నాలుగు నిముషాల ఐదు సెకండ్స్ వెనక్కి వెళ్ళిపోయాను.

ఇప్పుడంటే ఇలా అయిపోయాను కానీ, నేను కూడా ముప్ఫై నాలుగు సంవత్సరాల నలభై రెండు రోజుల మూడు గంటల నాలుగు నిముషాల ఐదు సెకండ్స్ సమయంలో పీలగా, యా, యా అని రిహార్సల్స్ వేసుకుంటూనే అమెరికాలో అడుగుపెట్టాను. తేడా అల్లా ఈ నవమన్మధుడికి గూగులూ, అమెరికా అంకులూ, తెలుగు సినిమా బొంకుల ధర్మమా అని అమెరికా గురించి నాకు తెలిసిన, తెలియని వివరాలెన్నెన్నో తెలుసును. మరియు జేబులో మూడు వేల డాలర్లు రొఖ్ఖం. మా నాన్న గారు తరచు వాడే ఈ రొఖ్ఖం అనే మాట అంటే నాకు ఎంతో ఇష్టం.... ఎందుకంటే మన దగ్గర లేనిదాని గురించే మనం ఇష్టం పెంచుకుంటాం కదా... రొఖ్ఖం అంటే కరెన్సీ అనమాట....నాకు మటుకు, ఆ రోజుల్లో గవర్నమెంటు వారు దయతో శాంక్షన్ చేసిన ఎనిమిది డాలర్లు, నేను ఒక పటేల్ దగ్గర డాలరుకి అక్షరాలా మూడు రూపాయలు పెట్టి కొనుక్కున్న మరొక పాతిక డాలర్లు, కాకినాడ మశీదు దగ్గర ఉండే మా నాన్న గారి క్లాస్‌మేట్ అల్లాఉద్దీన్ - తూ.గో జిల్లా వారి అభిమాన టైలర్- కుట్టిన బిగుతు కోటూ వేసుకుని హడిలి చచ్చిపోతూ అమెరికాలో దిగాను. సూటూ, బూటూ వేసుకోకపోతే అమెరికా రానివ్వరు అనే అమాయక తరం మాది. మోకాళ్ళకి నాలుగు అంగుళాలు కింద దాకా ఉండే నిక్కరు వేసుకో కుండా, జగ్గయ్య టైపులో కాలర్ ఉండే చొక్కా వేసుకోడానికి అమెరికా వెళ్ళడం ఎందుకూ, గావంచా పంచె కట్టుకుని గుమ్మడి టైపులో అంబాజీ పేటలోనే ఉండవచ్చు కదా అనుకునే తరం ఈ నాటిది. అదే జనరేషన్ గేప్ అంటే. అంటే ఎంత తక్కువ బట్టలు వేసుకుంటే అంత పురోగమించాం అని కూడా అర్ధం.

నేను అమెరికా రాగానే కనిపెట్టిన రహస్యం ఏమిటంటే "అమెరికాకులు అతి చిన్నవిగా యుండును.". అంతియునే కాక ఇక్కడ కాకులు అమెరికావు, కావు మంటూ కానీ, మరే విధంగా కానీ అరవడం నేను గత మూడు దశాబ్దాలుగా ఎప్పుడూ వినలేదు. ఆ మాటకొస్తే ఇక్కడ కాకులు ఏ ఇంటి మీదా వాలడం కూడా నేను ఎప్పుడూ చూడలేదు. ఎటొచ్చీ అప్పుడప్పుడు గడ్డీ, గాదమూ, లేదా సిమెంటు రోడ్డు మీదా కనపడినప్పుడు మాత్రంవాటి అచ్చు మనవేపు మామూలు కాకి, మాలకాకి, ఏడాదికొకసారి శ్రాద్ధానికి వచ్చిన మన తాత ముత్తాతల టైపు స్పెషల్ అవతారాల కాకుల మాదిరిగానే, మన హీరో డాన్సు స్టెప్పులు వేస్తూ సడెన్ జెర్క్‌లు ఇస్తూ పురుగులు ఏరుకుంటూ ఊపే బుర్ర ఊపుడు లాగానే ఉంటుంది. ఆ ఊపుడు నేను శాస్త్రోక్తంగా పరిశీలించిన తరవాతే "ఓహో" ఇవి మనకి తెలియని అమెరికా స్పెషల్ పక్షులు కాదు సుమా, అమెరికాకులు సుమా గుర్తుపట్టేశాను, నా బ్రిలియంట్ బుర్ర ఊపకుండానే ఉపయోగించి.

ఈ విధమైన అమెరికాకుల కొత్త బిహేవియర్ వలన అమెరికన్లందరికీ పూర్వం ఒక సమస్య ఉండేది. ఎందుకంటే, ఇంటికి చుట్టాలు ఎప్పుడొస్తారో తెలియడానికి ఈ కాకులు ఇంటి మీద వాలవూ, కావు, కావు మని అరిచి "చుట్టాలొస్తున్నారోయ్" అని మనకి ముందుగా ప్రకటనలు జారీ చెయ్యవు. అనగా ఎనౌన్స్ చేయవు.

మా చిన్నప్పుడు ఒక సారి మా ఇంటికి రోజూ వచ్చి వాలే ఒక కాకి...దాని పేరు... అంజలీ దేవి...మామూలు కంటే పొద్దున్నే వచ్చి, మా అమ్మ తరిగి పారేసిన వంకాయ గుత్తులు తింటూ గుత్తికీ గుత్తికీ మధ్య ఒకటే అరుపులు మొదలెట్టింది. "ఇక అనుమానం లేదు. ఇవాళ ఎవరో మనింటికి చుట్టాలొస్తున్నారు" అని మా అమ్మ మరొక తవ్వెడు బియ్యం పడేసింది. అరగంటలో పోస్ట్ వాడు వచ్చి అచ్చు సినిమాలో లాగా పోస్ట్ అని అరిచి, సినిమాలోలా కాకుండా మా అమ్మకి నమస్కారం పెట్టి కాస్త వంకాయ కూర సంచీలో వేసుకుని వెళ్ళాడు. ఆ కార్డు ముక్క మా కాకినాడకి పదిహేను మైళ్ళ దూరంలో ఉన్న జేగురుపాడు నుంచి వచ్చింది. దాని సారాంశం

ఏమిటంటే "చిరంజీవి సరప్పు చెల్లెలుకు ఆశీర్వచనములు. నేను ఫలానా రోజున మీ ఊరు వచ్చి మూడు దినములు ఉండుదును. నీకు తెలుసుగదా, మా తమ్ముడు ఆస్తి కోసం నా మీద అక్రమంగా వేసిన దావా అక్కడి మున్సిఫ్ మేజిస్ట్రేట్ వారి దివ్య సముఖమునకు విచారణకు వచ్చినది. అందువలన ఇందు మూలముగా నా రాకను నీకు తెలియ పరచుచున్నాను." ఈ ఉత్తరానికి అసలు అర్థం ఏమిటంటే, నాకు మూడు రోజులు భోజనమూ, రాత్రి మీ మామిడి చెట్టు కింద నాకు ఎప్పుడూ ఇచ్చే మడత మంచమూ, మొదటి - ఆట, వీలుంటే రెండవ ఆట సినిమాకు కూడా నాతో ఎవరైనా రావలయును" అని రిజర్వు చేసుకోవడం అన్నమాట. అందులో నాది కేవలం మడత మంచం డ్యూటీ.

ఆ మర్నాడు మా అమ్మ మళ్ళీ కూరల తరుగుడు కార్యక్రమంలో ఉండగా మరొక రెగ్యులర్ విజిటర్ కాకి....దీని పేరు నాగేశ్వరరావు....అంటే నిన్నటి కాకి తాలూకు హీరో అనమాట....ఈ నాగేశ్వరరావు సొగసుగా దొండకాయలు ముక్కున కరుచుకుంటూ తను కూడా కావు, కావు మంటూ కూతలు మొదలు పెట్టాడు. "మళ్ళీ ఏమిటి ఈ వెధవ కాకి గోల" అని మేము విసుక్కుంటూ ఉండగా, అదే పోస్ట్‌మేన్ మళ్ళీ వచ్చుట, జేగురుపాడు పక్కనే ఉన్న పాలతోడు గ్రామం నుంచి వచ్చిన మరొక కార్డు ఇచ్చి, ఇవాళ కూడా వంకాయే అనమాట అని సణుక్కుంటూ వెళ్ళుట జరిగాయి. ఈ ఉత్తరం సారాంశం ఏమిటంటే " లక్ష్మీసమానురాలైన సరప్పక్కయ్యకి, రామం బావ గారికీ నమస్కారం. నేను ఫలానా రోజున మీ ఊరు వచ్చి మూడు దినములు ఉండుదును. నీకు తెలుసుగదా, మా అన్నయ్య ఆస్తి కోసం నా మీద అక్రమంగా వేసిన దావా ది కాకినాడ మున్సిఫ్ మేజిస్ట్రేట్ వారి దివ్య సముఖమునకు విచారణకు వచ్చినది. అందువలన ఇందు మూలముగా నా రాకను మీకు తెలియ పరచుచున్నాను.". అంటే నాకు మరొక మడత మంచం డ్యూటీ పడిందనమాట. యధాప్రకారం మా నాన్న గారు, మా అమ్మకి దూరపు బంధువులూ, వరసకి అన్నదమ్ములూ అయిన ఆ అన్నదమ్ములిద్దరినీ ఆదరించి, ఒకరితో ఒకరు సెకండ్ షో సినిమాలు మూడు రోజులూ చూసే ఏర్పాటు చేసి, కోర్టుకి కూడా తీసుకెళ్ళేవారు. ఎక్కడైనా బావే కాని వంగతోట దగ్గర కాదనే రూలు ప్రకారం, ఆ అన్నదమ్ములు కోర్టులో కొట్టుకు చచ్చినా పైన అన్యోన్యంగానే ఉండే వారు. వాళ్ళిద్దరూ అల్లాఉద్దీన్ టైలర్ దుకాణం పక్కనే ఉన్న గోవిందరాజు చుట్టే చుట్టలంటే పడిచస్తారు. ద టీజ్ ఇండియా. ఇప్పుడు జేగురుపాడులో కానీ, పాలతోడు గ్రామలో కానీ సినిమా హాళ్ళు ఉన్నాయేమో నాకు తెలియదు.

ఈ దూరపు చుట్టాల పిట్ట కథ ఎందుకు జ్ఞాపకం వచ్చిందంటే అమెరికాకాకులు చాలా సైలెంట్ కాకులు కనక, మన ఇండియాలో లాగా చుట్టలు కాల్చే చుట్టాలొచ్చే కబురు ముందుగా తెలియక అవస్త పడలేకనే అమెరికా వాడు నానా అవస్తా పడి టెలిఫోన్ యంత్రాన్ని కనిపెట్టుకున్నాడు. అందుకే అమెరికాలో ఫోన్ చేసి, చెప్పకుండా చుట్టాలూ, స్నేహితులూ, ఇల్లు శుభ్రం చేసే పనివాళ్ళూ మనింటికి రారు. ఆ మాటకొస్తే కట్టుకున్న పెళ్ళాం, లేదా మొగుడూ కూడా "ఇప్పుడే ఆఫీసులో బయలు దేరాను. ఇంటికి రావచ్చా?" అని పెర్మిషన్ తీసుకుంటే కానీ సొంత ఇంట్లో కూడా అడుగు పెట్టరు. ఒక వేళ ఎవరైనా "ఇవాళ మీ ఇంటికి వస్తాం?" అని ఫోన్ చెయ్యగానే దానికి తగ్గట్టుగానే, "ఓ ష్యూర్, వుయ్ లవ్ టు హేవ్ యూ... బట్ వాల్‌మార్ట్ లో దుప్పట్ల సేల్ ఉంది కదా, పొద్దున్నే వెళ్ళాలి. మరి మధ్యాహ్నం మా ఎక్స్‌టెర్మినేటర్ ఎపాయింట్‌మెంట్ ఉంది. అంచేత సాయంత్రం మీరు నాలుగుంబావు, నాలుగూ నలభై మూడు మధ్యా వస్తే మనం హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు" అని అమెరికాకమ్మ కథలు చెప్పి డేమేజ్ కంట్రోల్ చేసుకుంటాం. ఇటువంటి కాకమ్మ కథలు చదవడానికి బావుంటాయి కదా! అందుకే మీకు పాత సారా కొత్త గ్లాసులో పోసే అమెరికాకమ్మ కథలే పాఠకులకి నా న్యూఇయర్ గిఫ్ట్... ఐ యాం ష్యూర్ యు ఆర్ నాట్ అన్ హేపీ! అఫ్ కోర్స్, చిన్న సమస్య ఏమిటంటే, ఈ గిఫ్ట్ తాలూకు రశీదు మీరు వాల్ మార్ట్‌కి తీసుకెళ్ళి మీకు కావలిసిన వస్తువులు తెచ్చుకోడానికి కుదరదు. ఐ యాం ష్యూర్ యు ఆర్ సారీ! ***